RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 286 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | శుక్రవారం, 19 ఏప్రిల్ 2024 | పేజీలు : 4 | వెల : 2/-

# సీఎం రేవంత్ రెడ్డికి...

# ఫుల్ డిమాండ్..!

హైదరాబాద్ : తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీలో ఫుల్ డిమాండ్ ఏర్పడింది. కాంగ్రెస్ పార్టీ నేషనల్ స్టార్ క్యాంపెయినర్ గా సీఎం రేవంత్ రెడ్డి సుడిగాలి పర్యటనలు చేయనున్నారు. ఇప్పటికే ప్రచారానికి రావాలని ఏడు రాష్ట్రాల నుండి రేవంత్ రెడ్డికి ఆహ్వానాలు అందాయి. ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర, కేరళ రాష్ట్రాల పీసీసీల నుంచి ఆహ్వానాలు వచ్చాయి. తాజాగా తమిళనాడు, బీహార్, గుజరాత్ రాష్ట్రాల నుండి కూడా పిలుపు వచ్చింది. ఇవాళ, రేపు కేరళ రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటించనున్నారు. రాహుల్ గాంధీ పోటీ చేస్తున్న వయనాడ్ పార్లమెంటులోనూ రేవంత్ ప్రచారం చేయనున్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పోటీ చేస్తున్న అలప్పుజ పార్లమెంట్ సెగ్మెంట్ లోనూ రేవంత్ రెడ్డి క్యాంపెయిన్ చేయనున్నారు. ఈ నెల 19 నుండి మే 11 వరకు తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి సుడిగాలి పర్యటన చేయనున్నారు. తెలంగాణ వ్యాప్తంగా 50 సభలు, 15 రోడ్ షో లకు కాంగ్రెస్ ప్లాన్ చేస్తోంది. మెదక్, వరంగల్, భువనగిరి, మహబూబ్ నగర్, మహబూబాబాద్ అభ్యర్థుల నామినేషన్ల దాఖలు సందర్భంగా నిర్వహించే ర్యాలీలో సీఎం రేవంత్ పాల్గొననున్నారు. ఒక్కో లోక్ సభ నియోజకవర్గంలో కనీసం మూడు చోట్ల సీఎం సభలు నిర్వహించేలా కాంగ్రెస్ పార్టీ కసరత్తు చేస్తోంది. లోక్ సభ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది.

ముఖ్యంగా నేషనల్ స్టార్ క్యాంపెయినర్ గా సీఎం రేవంత్ పై కీలకమైన బాధ్యతలు పెట్టారు. కాంగ్రెస్ పార్టీ మూడు రాష్ట్రాల్లో మాత్రమే అధికారంలో ఉంది. కర్నాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో మాత్రమే కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. సీఎం రేవంత్ వాగ్ధాటిగా మాట్లాడతారు. తూటాల్లాంటి మాటలతో రాజకీయ ప్రత్యర్థులపై విరుచుకుపడతారు. పదునైన విమర్శలతో ప్రత్యర్థులను ఉక్కిరిబిక్కిరి చేయడంలో రేవంత్ రెడ్డి దిట్ట. దాంతో రేవంత్ కు నేషనల్ స్టార్ క్యాంపెయినర్ గా కీలకమైన బాధ్యతలు అప్పగించింది కాంగ్రెస్.



## కాంగ్రెస్ పార్టీ నేషనల్ స్టార్ క్యాంపెయినర్‌గా కీలక బాధ్యతలు

**50 సభలు, 15 రోడ్ షోలు... సీఎం రేవంత్ సుడిగాలి పర్యటన :** కాంగ్రెస్ పార్టీ నేషనల్ స్టార్ క్యాంపెయినర్ గా వ్యవహరించనున్నారు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి. ఎన్నికల ప్రచారానికి రావాలని 7 రాష్ట్రాల పీసీసీల నుంచి రేవంత్ కు ఆహ్వానం వచ్చింది. ఇందులో ఏపీ, కర్ణాటక,మహారాష్ట్ర,కేరళతో పాటు తమిళనాడు,బీహార్ ,గుజరాత్ రాష్ట్రాలు ఉన్నాయి. ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి ప్రచార షెడ్యూల్ ఖరారైంది. ఇవాళ, రేపు కేరళలో రెండు రోజులు రేవంత్ ప్రచారం చేయనున్నారు. రాహుల్ గాంధీ పోటీ చేస్తున్న వయనాడ్ తో పాటు కేసీ వేణుగోపాల్ పోటీ చేస్తున్న అలప్పుజ సెగ్మెంట్లలో క్యాంపెయిన్ చేయనున్నారు. మరో వైపు ఏప్రిల్ 19 నుంచి వచ్చేనెల 11 వరకు రాష్ట్రంలో సీఎం రేవంత్ సుడిగాలి పర్యటన చేయనున్నారు రేవంత్. 50 సభలు, 15 రోడ్ షోలలో పాల్గొనున్నారు.

# హైదరాబాద్‌లో మాధవీలత.. దుమ్మురేపుతోందిగా?



హైదరాబాద్ అంటే హైటెక్ సిటీనో మరేదో కాదు. అసలు సిసలైన పాతబస్తీతో కూడిన ప్రాంతం. ఈ లోక్ సభ స్థానం తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. దీని పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు వస్తాయి. ఇందులో మజ్లిస్ పార్టీ కొన్ని దశాబ్ధాలుగా తన జెండా ఎగురవేస్తూ వస్తోంది. ఇది లోక్ సభ ఎన్నికల్లో ఆ పార్టీకి కలిసి వచ్చే అంశం. ముఖ్యంగా దేశంలో ఎలాంటి పరిణామాలు ఎదురైనా.. మూసీ నది ఆవల వైపు దక్షిణాన ఉన్న హైదరాబాద్ లోక్ సభ స్థానంలో 40 ఏళ్ల నుంచి ఎంఐఎం పార్టీ తిష్ఠ వేసుకొని కూర్చొంది. ఇది ఓ రకంగా చెప్పాలంటే ఆ పార్టీకి కంచుకోట. ఎంఎంఐఎం అధినేత అసదుద్దీన్ 2004 నుంచి ఇక్కడ గెలుస్తూ వస్తున్నారు. కానీ ఈసారి గెలుపు అంత సులభంగా దక్కే అవకాశాలు లేవని విశ్లేషకులు చెబుతున్నారు. ఇక్కడ బీజేపీ తమ అభ్యర్థిగా మాధవీ లతను ఎంపిక చేసింది. అప్పటి నుంచి ఆమె పేరు రాష్ట్ర వ్యాప్తంగా మార్మోగుతూ వస్తోంది. హైదరాబాద్ లోక్ సభ స్థానంలో పది సార్లు గెలిచిన ఎంఐఎం అక్కడి ప్రజలకు ఏం చేయలేదనే వాదనతో ఆమె రంగంలోకి దిగింది. ముఖ్యంగా అభివృద్ధి గురించి ప్రస్తావిస్తూ .. అధికారంలోకి వస్తే ఏం చెస్తానో చెబుతూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. మరోవైపు ఎంఐఎం ఆమెపై వ్యక్తిగత దూషణలకు దిగడంతో పాటు భతర నాట్యం చేస్తున్న వీడియోలపై అభ్యంతరకరంగా మాట్లాడుతున్నారు. కానీ ఆమె ట్రిపుల్ తలాక్ చట్టాల గురించి ప్రచారం చేస్తూ.. కొంతమంది ముస్లిం మహిళలను తమ వైపునకు తిప్పుకుంటుంది. మరోవైపు ఇక్కడ ఆమె గ్రాఫ్ క్రమక్రమంగా పెరుగుతుందని పలు సర్వేలు చెబుతున్నాయి. మొత్తంగా ముస్లిం ఓటు బ్యాంకుతో పాటు సంప్రదాయ హిందూ ఓటర్లు ఆమెకు అనుకూలంగా ఉన్నారు. ఏది ఏమైనా ఈ సారి అసదుద్దీన్ కి గెలుపు అంత సులభంగా దక్కే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయని ఆమె ప్రచారంతో అర్థం అవుతుంది.



## సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ గురువారం జారీ అయింది. నాలుగో విడత పోలింగ్ కోసం నోటిఫికేషన్ విడుదల అయింది. నేటి నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమయింది. నాలుగో విడతలో ఏపీ, తెలంగాణలో ఎన్నికలు జరగనున్నాయి. ఈ నెల 25 వరకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగనుంది. ఉదయం 11 గంటల నుంచి 3 గంటల వరకు నామినేషన్ల ప్రక్రియ జరగనుంది.

ఈ నెల 26న నామినేషన్ల పరిశీలన చేపట్టనున్నారు. ఈ నెల 29 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు కేటాయించారు. మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ జరగనుంది.

10 రాష్ట్రాల్లోని 96 నియోజకవర్గాలకు నోటిఫికేషన్ ను ఈసీ విడుదల చేసింది. తెలంగాణలో ఎంపీ ఎన్నికలతో పాటు సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ ఉపఎన్నిక జరగనుంది.

# తొలిదశకు సర్వం సిద్ధం

## భారీ ఓటింగ్ జరిగేనా...!?

## 102 లోక్‌సభ స్థానాలకు ఓటర్ల తీర్పు

## అరుణాచల్, సిక్కిం అసెంబ్లీలకు కూడా



## 21 రాష్ట్రాల్లో పోలింగ్.. బరిలో 8మంది కేంద్రమంత్రులు

న్యూఢిల్లీ : సార్వత్రిక ఎన్నికల తొలిఘట్టం శుక్రవారం ప్రారంభం కానుంది. మొత్తం ఏడు దశల్లో నిర్వహిస్తున్న ఎన్నికల్లో తొలిదశకు కేంద్ర ఎన్నికల సంఘం శుక్రవారం శ్రీకారం చుట్టనుంది. మొత్తం 102 లోక్‌సభ స్థానాల్లో అభ్యర్థుల భవితవ్యాన్ని ఓటర్లు ఈవీఎంలలో నిక్షిప్తం చేయనున్నారు. తొలి దశలో తమిళనాడులోని మొత్తం 39 స్థానాలు సహా 21 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని లోక్‌సభ సీట్లకు పోలింగ్ జరగనుంది. అదేవిధంగా అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ కూడా తొలిదశలోనే జరగనుంది. అరుణాచల్ ప్రదేశ్‌లోని అసెంబ్లీ 60 స్థానాలు, సిక్కింలోని 32 స్థానాలకు ఓటర్లు తీర్పు ఇవ్వనున్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం సర్వం సిద్ధం చేసింది.

**బరిలో ఉద్దండులు...** తొలిదశ ఎన్నికల్లో రాజకీయ ఉద్దండులు పోటీపడుతున్నారు. వీరిలో ఎనిమిది మంది కేంద్ర మంత్రులు, ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులు, ఒక మాజీ గవర్నర్ ఉన్నారు. బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మంత్రి గడ్కరీ వరుసగా మూడోసారి నాగపూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. రెండుసార్లు గెలిచిన ఆయన మూడోసారి విజయం కోసం ప్రయత్నిస్తున్నారు. 2014లో ఆయన ఏడు సార్లు ఎంపీగా గెలిచిన విలాస్ ముత్తెంవార్‌ను 2.84 లక్షల ఓట్ల మెజారిటీతో ఓడించారు. 2019లో 2.16 లక్షల మెజారిటీతో మహారాష్ట్ర కాంగ్రెస్ పార్టీ చీఫ్ నానా పటోల్‌పై విజయం దక్కించుకున్నారు. కేంద్ర మంత్రుల్లో కిరెన్ రిజిజు అరుణాచల్ ప్రదేశ్ వెస్ట్ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. రిజిజు ప్రధాన ప్రత్యర్థి అరుణాచల్ ప్రదేశ్ కాంగ్రెస్ పీసీసీ చీఫ్ నబం తుకి. శర్బానంద్ సోనోవాల్ అసోంలోని డిబ్రుగఢ్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. ప్రస్తుతం ఈయన రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. యూపీలోని ముజఫర్‌నగర్ నుంచి సంజీవ్ బలియాన్ పోటీ చేస్తున్నారు. సమాజ్ వాదీ పార్టీ నుంచి హరీంద్రమాలిక్, బీఎస్పీ నుంచి దారా సింగ్ ప్రజాపతి బరిలో ఉన్నారు. ఉధంపూర్ నుంచి వరుసగా మూడోసారి పోటీ చేస్తున్న జితేంద్రసింగ్ హ్యాట్రిక్ కోసం తపిస్తున్నారు. భూపేంద్ర యాదవ్ రాజస్థాన్‌లోని అల్వార్ నుంచి పోటీలో ఉన్నారు. సిట్టింగ్ ఎంపీ బాలక్‌నాథ్‌ను పక్కన పెట్టిమరీ బీజేపీ ఈయనకు అవకాశం ఇచ్చింది. రాజస్థాన్‌లోని బికనీర్ నుంచి అర్జున్‌రామ్ మేఘ్వాల్ బరిలో ఉన్నారు. ఈయనపై కాంగ్రెస్ నుంచి మాజీ మంత్రి గోవింద్‌రామ్ మేఘ్వాల్ పోటీచేస్తున్నారు. తమిళనాడులోని నీలగిరి నియోజకవర్గం హాట్ టాపిక్‌గా మారింది. ఇక్కడ నుంచి కేంద్ర మంత్రి, బీజేపీ నేత ఎల్.మురుగన్, డీఎంకే నేత, సిట్టింగ్ ఎంపీ ఏ. రాజా పోటీ చేస్తున్నారు. తమిళనాడులోని శివగంగ నియోజకవర్గం మరింత ఆసక్తిగా మారింది. ఇక్కడ నుంచి కేంద్ర మాజీ మంత్రి చిదంబరం కుమారుడు, సిట్టింగ్ ఎంపీ కార్తి కాంగ్రెస్ తరఫున బరిలో ఉన్నారు. తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ కూడా తొలిదశలోనే అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. చెన్నై దక్షిణ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. 2019లో తూత్తుకుడి నుంచి పోటీ చేసిన తమిళిసై డీఎంకే అభ్యర్థి కనిమొళి చేతిలో పరాజయం పాలయ్యారు. మధ్యప్రదేశ్ మాజీ సీఎం కమల్‌నాథ్ కుమారుడు నకుల్ నాథ్ ఛింద్వారా నుంచి పోటీ చేస్తున్నారు. ఇక్కడ కమల్‌నాథ్ కుటుంబానికి 1980 నుంచి ఎదురన్నదే లేకపోవడం గమనార్హం. త్రిపురలో హైఓల్టేజ్ సీటుగా పేరున్న పశ్చిమ త్రిపుర నుంచి మాజీ సీఎం బిప్లబ్ దేబ్, కాంగ్రెస్ రాష్ట్ర చీఫ్ ఆశిషకుమార్ తలపడుతున్నారు. రాజస్థాన్‌లోని చురు నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిగా రెండు సార్లు ఒలింపిక్ పసిడి పతాన్ని కైవసం చేసుకున్న జావెలిన్ త్రో క్రీడాకారుడు దేవేంద్ర ఝఝారియా పోటీ చేస్తున్నారు. లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా రాజస్థాన్‌లోని కోట నియోజకవర్గం నుంచి బరిలో ఉన్నారు. తొలి దశలో బీజేపీ 77 స్థానాల్లో పోటీ చేస్తుండగా ఎన్డీయే పక్షాలు 23 చోట్ల బరిలో ఉన్నాయి. ఇండియా కూటమిలో కాంగ్రెస్ 57 స్థానాల్లో, మిత్రపక్షాలు 42 చోట్ల పోటీలో ఉన్నాయి. తొలి దశలో అరుణాచల్ ప్రదేశ్‌లోని 2, ఉత్తరాఖండ్ 5, అసోం 5, బిహార్ 4, ఛత్తీసగఢ్ 1, మధ్యప్రదేశ్ 6, మహారాష్ట్ర 5, మేఘాలయ 2, మణిపూర్ 2, మిజోరాం 1, నాగాలాండ్ 1, రాజస్థాన్ 12, సిక్కిం 1, తమిళనాడు 39, త్రిపుర 1, యూపీ 8, పశ్చిమ బెంగాల్ 3, అండమాన్, జమ్ముకశ్మీర్, లక్షద్వీప్, పుదుచ్చేరిలలో ఒక్కొక్కస్థానానికి ఎన్నికలు జరగనున్నాయి.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## అగ్రరాజ్యంలో హిందువులపై దాడులు.. తీవ్ర ఆందోళన.. ఏం జరుగుతోంది?

అగ్రరాజ్యం అమెరికాలో హిందువులపై దాడులు పెరుగుతున్నాయని గత కొన్నాళ్లుగా వినిపిస్తూనే ఉంది. ముఖ్యంగా భారత్‌లో హిందూ భావజాలం వ్యాప్తిపై జరుగుతున్న ప్రచారం.. తీసుకుంటున్న నిర్ణయాలు వంటివి అమెరికాలోనూ ప్రభావం చూపిస్తున్నాయని ఇక్కడి హిందూ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కొన్నాళ్ల కిందట అమెరికాలో కొన్ని హిందూ సంఘాలు ప్రత్యేకంగా సమావేశమై.. తమపై జరుగుతున్న దాడులను ఖండించాయి. ముఖ్యంగా ఆలయాలు.. వ్యక్తులను కేంద్రంగా చేసుకుని జరుగుతున్న దాడులను నిలువరించాల్సిన అవసరం ఉందని తేల్చి చెప్పాయి. ఇప్పుడు తాజాగా సెనేట్ ప్రతినిధి ఒకరు కూడా ఇదే ఆవేదన వ్యక్తం చేశారు.

**ఏం జరుగుతోంది..?** : అమెరికాలో ఉన్న జనాభాలో 9 శాతం మంది హిందువులే కావడం గమనార్హం. ప్రవాస భారతీయులతో పాటు.. చైనా, టిబెట్, నేపాల్, జపాన్ తదితర దేశాల నుంచి వెళ్తున్న హిందువులు(వీరిలో బౌద్ధులు కూడా ఉన్నారు) అక్కడ ప్రత్యేకతను సంతరించు కున్నారు. ఇక, భారత్ నుంచి వెళ్లిన హిందువులు అయితే.. ఇటీవల కాలంలో ఆలయాలు కూడా నిర్మించి.. ప్రార్థనలు, పూజలు చేస్తున్నారు. కానీ, ఎన్నడూ లేని విధంగా గత దశాబ్ద కాలంగా అమెరికాలో హిందువులపై దాడులు జరుగుతున్నాయి. ఆలయాలపై దాడులు పెరుగుతున్నాయి. ఈ విషయమే ఇప్పుడు అమెరికాలో హిందు వర్గాలను కలచి వేస్తోంది. ముఖ్యంగా హిందువులు ఎక్కువగా ఉన్న కాలిఫోర్నియా, న్యూయార్క్ సహా పలు రాష్ట్రాల్లో ఈ తరహా దాడులు జరుగుతున్నాయి.

**తాజా విషయం ఏంటంటే..** ఇండో-అమెరికన్ చట్టసభ సభ్యుడు తానేదార్ హిందువులపై జరుగుతున్న దాడులపై ఆందోళన వ్యక్తంచేశారు. హిందువులకు వ్యతిరేకంగా కొన్ని సంస్థలు, సంఘాలు సమన్వయంతోనే ఈ దాడులు చేస్తున్నాయనేది ఆయన ప్రధాన ఆరోపణ. 'అమెరికాలో నేడు హిందువులపై దాడులు గణనీయంగా పెరిగాయి. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో హిందువులపై రోజు రోజుకు అసత్య ప్రచారం పెరిగిపోతోంది. ఇలాంటి దాడులను మనకు మనమే నిలువరించుకోవాలి. దీనికి వ్యతిరేకంగా కలిసికట్టుగా ముందుకుసాగాలి అని తానేదార్ పేర్కొన్నారు. నేషనల్ ప్రెస్‌క్లబ్‌లో హిందూయాక్షన్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో తానేదార్ మాట్లాడుతూ.. ఇంత జరుగుతున్నా దాడులకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోకపోవడంతోపాటు ఇప్పటికీ ఎవరినీ అరెస్టు చేయలేదన్నారు. దర్యాప్తు సంస్థలు విచారణ మొదలుపెడుతున్నప్పటికీ వాటిపై పురోగతి ఉండటం లేదన్నారు. ఇప్పటికైనా హిందువులపై జరుగుతున్న దాడుల విషయంలో పోలీసులు, ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ సహా న్యాయశాఖ దృష్టి పెట్టాలని ఆయన విన్నవించారు. ఈ విషయంలో ఇండో-అమెరికన్ సభ్యులు రోఖన్నా, రాజా కృష్ణమూర్తి, అమీబెరా, ప్రమీలా జయపాల్ ఇటీవల న్యాయ శాఖకు లేఖలు కూడా రాసినట్టు పేర్కొన్నారు. కాగా.. గత ఏడాది భారత్ కూడా ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.

# రెండేళ్లయినా.. అసంపూర్తిగానే!



ఇబ్రహీంపట్నం: సర్కారు బడుల్లో మౌలిక వసతులు కల్పించి, విద్యా రంగాన్ని పటిష్టం చేయాలని గత ప్రభుత్వం 'మన ఊరు-మన బడి' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జిల్లాలో 274 పాఠశాలల్లో అభివృద్ధి పనులను ప్రారంభించగా రెండేళ్ల గడిచినప్పటికీ సగానికి పైగా పాఠశాలల్లో నిర్మాణాలు నేటికీ పూర్తికాలేదు. పలు పాఠశాలల్లో పాత తరగతి గదులను తొలగించగా నూతన గదుల కోసం, ఇతర నిర్మాణాల కోసం పనులు ప్రారంభించగా అసంపూర్తిగా మిగిలి ఉన్నాయి. మన ఊరు-మన బడి కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో ఇబ్బందులు తొలగుతాయని భావించిన విద్యార్థులకు కొత్త సమస్యలు ఎదురయ్యాయి. ఈ విద్యా సంవత్సరం ముగియనుండడంతో వేసవి సెలవుల్లో పనులు పూర్తి చేస్తేనే వచ్చే విద్యా సంవత్సరంలోనైనా విద్యార్థులకు ఇబ్బందులు తొలగిపోనున్నాయి. జిల్లాలోని పలు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలపై కథనం..

పునాదుల దశలోనే..

ఇబ్రహీంపట్నం: మండలంలో 'మన ఊరు మనబడి' కార్యక్రమంలో మొదటి విడతలో ఇబ్రహీంపట్నం, గోధూర్, వర్షకొండ జిల్లా పరిషత్, కోజన్ కొత్తూర్ మండల పరిషత్ ఉన్నత పాఠశాలలు, కోమటి కొండాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల, మూలరాంపూర్, వర్షకొండ, గోధూర్, ఇబ్రహీంపట్నంలోని రెండు ప్రాథమిక పాఠశాలలున్నాయి. కోమటి కొండాపూర్ ప్రాథమికోన్నత, ఇబ్రహీంపట్నంలోని ఒడ్డెర కాలనీ ప్రాథమిక పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తయ్యాయి. మిగిలిన పాఠశాలల్లో అభివృద్ధి పనులు ప్రారంభించినప్పటికీ మధ్యలోనే నిలిచిపోయాయి. ఇబ్రహీంపట్నం, గోధూర్ గ్రామాల్లోని ఉన్నత పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం పనులను ప్రారంభించగా పిల్లర్ల దశలోనే నిలిచి పోయింది.

రెండు పాఠశాలల్లోనే..

మల్యాల: మండలంలో రామన్నపేట, మల్యాల బాలుర, బాలికల, బల్వంతాపూర్, తక్కళ్లపల్లి, తాటిపల్లి, రాంపూర్, మద్దుట్ల గ్రామాల్లోని జడ్పీ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలు(మొత్తం 13) 'మన ఊరు-మన బడి' పథకం కింద ఎంపికయ్యాయి. రామన్నపేట గ్రామంలోని జడ్పీ, ప్రాథమికోన్నత పాఠశాలలో మాత్రమే వంద శాతం పనులు పూర్తికాగా మిగిలిన పాఠశాలల్లో 30 నుంచి 40 శాతం వరకు పనులు జరిగాయని మండల విద్యాధికారి శ్రీనివాస్ తెలిపారు. కొన్ని పాఠశాలల్లో మేజర్ పనులతోపాటు మరమ్మతు పనులు, విద్యుత్, కలరింగ్ పనులు చేపట్టలేదని వివరించారు. చేసిన పనులకు బిల్లుల మంజూరు నిలిచిపోవడంతో గుత్తేదార్లు ఆసక్తి చూపడంలేదని అధికారులు పేర్కొంటున్నారు.

చెల్లింపుల్లేక..

సారంగాపూర్: మండలంలో 33 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా ఇందులో 12 పాఠశాలలను మన ఊరు-మన బడి కింద ఎంపిక చేశారు. సారంగాపూర్ ప్రాథమిక, ఉన్నత, పెంబట్ల ప్రాథమిక, ఎస్‌జే కాలనీ పాఠశాలల్లో పనులు పూర్తి చేసుకుని ప్రారంభం కాగా మిగతా ఎనిమిది పాఠశాలల్లో పనులు కొనసాగుతూనే ఉన్నాయి. రంగపేట, ప్రాథమిక, ఉన్నత, పోచంపేట, కోనాపూర్ ఉన్నత పాఠశాల, రేచపల్లి ఉన్నత, ప్రాథమిక, గణేష్‌పల్లె పాఠశాలల్లో పనులు నిలిచిపోయాయి. కొన్ని నెలలుగా చేసిన పనులకు చెల్లింపులు లేకపోవడంతో మధ్యలోనే నిలిపివేశారు.

మండలంలో మొత్తం 18 పాఠశాలల్లో 'మన ఊరు మనబడి' కార్యక్రమం కింద పనులు చేపట్టారు. దోనూర్, తిమ్మాపూర్, జైన, నేరెళ్ల, ధర్మపురిలో రెండు పాఠశాలల్లో పనులు పూర్తి చేశారు. ధర్మపురిలోని బాలుర ఉన్నత పాఠశాలలో డైనింగు హాలు నిర్మాణం ఇంకా పూర్తవలేదు. మిగిలిన 13 పాఠశాలల్లో 50 నుంచి 60 శాతం పనులు పూర్తయ్యాయి. గుత్తేదారుల నిర్లక్ష్యం, అధికారుల చొరవ చూపనికారణంగా పరిస్థితి అధ్వానంగా మారింది. గుత్తేదారులు మొదట్లో ఆసక్తి కనబరచినా ఎన్నికలు రావడంతో పనులు నిలిచి పోయాయి. క్షేత్ర స్థాయిలో ప్రజాప్రతినిధులు, అధికారుల మధ్య సమన్వయలోపంతో పనుల్లో జాప్యం నెలకొంది.

9 బడుల్లో పూర్తి..

మెట్‌పల్లి పట్టణంతో పాటు మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు కలిపి 57 ఉండగా, 4,175 మంది విద్యార్థులు చదువుతున్నారు. 'మన ఊరు మనబడి' కింద 20 పాఠశాలలను ఎంపిక చేశారు. 9 పాఠశాలల్లో పనులు పూర్తికాగా, అయిదు పాఠశాలల్లో చివరి దశలో ఉన్నాయి. మరో ఆరు పాఠశాలల్లో పనులు ప్రగతిలో ఉన్నాయి. కోనరావుపేటలో ప్రాథమిక పాఠశాల గదులు శిథిలావస్థకు చేరుకోగా, నాలుగు గదులు మంజూరయ్యాయి. ఉపాధి హామీ కింద వంటగది, మూత్రశాలలు ఇంకా ప్రారంభం కాలేదు. వెల్లుల్లలో వంటగది అసంపూర్తిగా ఉంది. బిల్లులు రాక పనుల్లో జాప్యం జరుగుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

గుత్తేదారుల అనాసక్తి

కోరుట్ల పట్టణం, మండలంలో మొత్తం 54 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఇందులో 'మన ఊరు మన బడి' కింద మొదటి విడతలో భాగంగా 9 ఉన్నత, 11 ప్రాథమిక పాఠశాలలు కలిపి మొత్తం 20 పాఠశాలలు ఎంపికయ్యాయి. వీటి నిర్మాణం కోసం రూ.7.49 కోట్ల నిధులు మంజూరయ్యాయి. గతేడాది కేవలం 3 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తి చేశారు. మిగతా 16 పాఠశాలల్లో పనులను ప్రారంభించినా బిల్లులు రావడం లేదని మధ్యలోనే వదిలేశారు. ఒక పాఠశాలలో ఇప్పటి వరకు ఎలాంటి పనులను ప్రారంభించకుండా వదిలేశారు.

రేకుల షెడ్ల కిందనే..

మండలంలో మల్లాపూర్, ఒబులాపూర్, మొగిలిపేట, గుండంపల్లి, సాతారం, చిట్టాపూర్, రేగుంట, వెంపల్లి, వెంకట్రావుపేట, సాతారం గ్రామాల్లోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఎంపిక చేసి నిధులు మంజూరు చేశారు. రేగుంట ఉన్నత పాఠశాల మినహా ఎక్కడా భవన నిర్మాణాలు పూర్తికాలేదు. కొన్ని చోట్ల ఉన్న గదులను తొలగించి కొత్త వాటిని నిర్మించకపోవడంతో రేకుల షెడ్లు, ఫ్లెక్సీల కింద తరగతి గదులను నిర్వహించాల్సి వస్తుంది. మల్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో కేవలం మూడు గదులు మాత్రమే ఉండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

# 'మత్తు'కు కొత్త ఎత్తులు..!

సూర్యాపేట : సూర్యాపేట పట్టణం చర్చికాంపౌండ్ ప్రాంతానికి చెందిన ఓ యువకుడు అదే పనిగా గంజాయి విక్రయిస్తుండటంతో పోలీసులు పీడీయాక్ట్ నమోదు చేశారు. అయినా ఆ వ్యాపారాన్ని మాత్రం విడిచి పెట్టడం లేదు. జిల్లా వ్యాప్తంగా గంజాయి నెట్‌వర్క్‌కు ఈయన కీలకంగా వ్యవహరిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇదే వ్యాపారంలో రూ.లక్షలు ఆర్జించి ఇటీవల సొంతంగా నూతన గృహాన్ని నిర్మించుకున్నాడు. ఇతని కింద గంజాయి సరఫరా చేసే మరో 23 ఏళ్ల యువకుడు రూ.2 లక్షల విలువైన ద్విచక్ర వాహనాన్ని ఇటీవల కొనుగోలు చేశాడు. సూర్యాపేట పట్టణం తాళ్లగడ్డకు చెందిన ఐదుగురు యువకులు నిత్యం గంజాయి మత్తులో తూగుతుంటారు. పాతికేళ్ల వయస్సులో ఉండే వీరిలో ఎవరి బరువూ నలభై కిలోలకు మించి ఉండదు. యుక్తవయస్సులోనే గంజాయి వ్యసనానికి బానిసలయ్యారు. హైదరాబాద్‌లోని ధూల్‌పేట నుంచి గంజాయి తెచ్చి వినియోగించడంతోపాటు పలువురు యువకులకు విక్రయిస్తున్నారు. వీరిని పోలీసులు పలుమార్లు అదుపులోకి తీసుకున్నా.. ఏదో ఒక రకంగా బయటపడుతున్నారు. తిరిగి అదే వ్యసనంలో మునిగితేలుతున్నారు. రాయినిగూడెం కేంద్రంగా నిత్యం రాత్రి వేళల్లో వీరు కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది.

రాష్ట్రంలో మాదక ద్రవ్యాల (డ్రగ్స్) నిర్మూలనలో రాజీపడే ప్రసక్తే లేదు. రాష్ట్రంలో ఆ మాటే వినపడకూడదు. యాంటీ నార్కోటిక్ బ్యూరో విభాగాన్ని బలోపేతం చేసి, పూర్తి స్థాయి డైరెక్టర్‌ను నియమిస్తాం. గంజాయి, కొకైన్, హెరాయిన్ సరఫరాను నియంత్రించి, రవాణా చేసే నిందితులను గుర్తించి కఠిన చర్యలు చేపట్టాలి. తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్ది.. దేశానికి ఆదర్శంగా నిలపాలి.

సూర్యాపేట జిల్లా కేంద్రంలో గంజాయి గుప్పుమంటోంది. యువతే లక్ష్యంగా భారీగా విక్రయాలు కొనసాగుతున్నాయి. పోలీసుల నిఘానూ లెక్కచేయకుండా ఎత్తుకు పైఎత్తులు వేస్తూ అవలీలగా కావాల్సిన మత్తును పొందుతున్నారు. ఐదేళ్ల క్రితం సూర్యాపేటలో ఒకే ఒక్క గంజాయి విక్రేత అందుబాటులో ఉండేవాడు.. ప్రస్తుతం ఈ సంఖ్య రెండు వందలకు చేరిందంటే పరిస్థితి ఎంత దారుణంగా తయారైందో అర్థం చేసుకోవచ్చు. గంజాయి విక్రయిస్తూ లేదా వినియోగిస్తూ పట్టుబడిన పాత నేరస్థులు అలవాటుగా తిరిగి అదే ప్రవృత్తిలో కొనసాగుతుండటం గమనార్హం. వీరిపై నిఘా పెడితే గంజాయి వినియోగాన్ని కొంత మేర అడ్డుకోవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయినా పోలీసులు అటువైపుగా అడుగులు వేయలేకపోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

సీలేరు నుంచి సూర్యాపేటకు..

పోలీసుల నిఘాను తప్పించుకొని గంజాయి విక్రేతలు కొత్త దారులు వెతుక్కుంటున్నారు. గతంలో పెద్దమొత్తంలో గంజాయిని ఆంధ్ర, ఒడిశా సరిహద్దుల నుంచి కార్లల్లో తరలించే వారు. ప్రస్తుతం పోలీసుల నిఘా పెరగడంతో ద్విచక్ర వాహనాలను ఎంచుకున్నారు. వినియోగదారులంతా కలిసి డబ్బు పోగుచేసుకొని, సమూహంగా ఏర్పడి నలుగురు యువకులను రెండు ద్విచక్ర వాహనాల్లో సీలేరు లేదా విశాఖపట్నం ప్రాంతానికి పంపిస్తున్నారు. గంజాయిని తక్కువ మోతాదులో కొనుగోలు చేసుకొని ఒక ద్విచక్ర వాహనంపై ఇద్దరు యువకులు బయలుదేరుతారు. మరో ఇద్దరు యువకులు వీరికి ఎస్కార్ట్ (రక్షణ)గా ముందు ఉంటారు. ఎక్కడైనా పోలీసుల తనిఖీలున్నట్లు గుర్తిస్తే వెంటనే చరవాణి ద్వారా సమాచారం చేరవేస్తారు. వారు భద్రాచలం మీదుగా ఖమ్మం చేరుకొని దంతాలపల్లి నుంచి సూర్యాపేటకు చేరుకుంటున్నట్లు సమాచారం. మరికొంత మంది యువకులు హైదరాబాద్ ధూల్‌పేటపై ఆధారపడుతున్నారు. గంజాయిని కాగితంలో చుట్టగా చుట్టి వినియోగించేందుకు అవసరమైన ఓసీబీ పేపర్లనూ జిల్లా కేంద్రంలో విచ్చలవిడిగా విక్రయిస్తున్నట్లు తెలిసింది.

తల్లిదండ్రులపైన వేధింపులు

గంజాయి వ్యసనానికి బానిసలైన వారు వింత వింతగా ప్రవర్తిస్తూ సాధారణ జనజీవనానికి ఇబ్బందులు కల్పిస్తున్నారు. రహదారులపై నడుచుకుంటూ వెళ్లే వారిపైనే కాకుండా ఇంట్లో తల్లిదండ్రులపైనా మత్తులో తమ ప్రతాపం చూపుతున్నారు. తల్లిదండ్రుల మాటలను పెడచెవిన పెట్టి వారిపైనే భౌతిక దాడులకు సైతం పాల్పడుతున్నారు. మత్తులో వీరి చేష్టలకు విసిగి వేసారిన తల్లిదండ్రులు కన్న పిల్లలనే కడతేర్చిన ఘటనలూ జిల్లాలో ఉన్నాయి. కోదాడలో ఓ తల్లి గంజాయి వ్యసనానికి బానిసగా మారిన తన కుమారుడిని చేతులు, కాళ్లు కట్టేసి కంట్లో కారం కొట్టిన విషయం విదితమే. తిరుమలగిరి ప్రాంతంలో ఓ తల్లి ఏకంగా కుమారుడిని హతమార్చింది. పోలీసులు గంజాయి విక్రయాలపై కఠినంగా వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు.

నిఘా పటిష్ఠం చేస్తాం- రాజశేఖర్, ఇన్‌స్పెక్టర్, సూర్యాపేట

సూర్యాపేట జిల్లా కేంద్రంలో గంజాయి విక్రయాలపై ప్రత్యేక బృందాన్ని నియమిస్తాం.

పటిష్ఠమైన నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకుంటాం. నిత్యం ఐడీ పార్టీ సిబ్బంది పర్యవేక్షణ కొనసాగుతోంది. సూర్యాపేట శివారు ప్రాంతాలతోపాటు 60 ఫీట్ల రోడ్డులోనూ ప్రత్యేక సిబ్బంది నియమించి తగిన చర్యలు తీసుకుంటాం.

# మాటల్లేవు.. మీటలే..!

నాంపల్లి : ఏడో తరగతి వరకు అంతా కలిసే చదువుకున్నారు. ఆ తర్వాత ఇంజినీరింగ్ వరకు వేర్వేరు కళాశాలలు. తమ స్నేహాన్ని పునరుద్ధరించుకోవడానికి అంతా కలిసి సామాజిక మాధ్యమాన్ని వేదికగా చేసుకున్నారు. కానీ ఇద్దరు యువతీ, యువకుల మధ్య చనువు పెరిగింది. స్నేహితుడిని నమ్మి యువతి తన ఫొటోలను యువకుడికి పంపింది. ప్రేమ పేరిట మోసగించిన అతడు కొన్నాళ్లకు ఇష్టం లేదని చెప్పాడు. దిక్కుతోచక ఆత్మహత్యాయత్నం చేసిన ఆమెను మానసిక నిపుణుల వద్దకు తీసుకురావడంతో మామూలు మనిషిగా మారింది. ఇంటర్ చదువున్న విద్యార్థినికి తండ్రి స్మార్ట్ ఫోన్ కొనిచ్చాడు. ఫేస్‌బుక్ ద్వారా తెలియని వ్యక్తితో స్నేహం మొదలైంది. ఆ ఆకర్షణ కాస్తా ప్రేమగా మారింది. మాయమాటలు నమ్మి వ్యక్తిగత ఫొటోలనూ పంచుకుంది. చివరకు అతడి నిజస్వరూపం బయటపడింది. డబ్బులు ఇవ్వకుంటే అంతర్జాలంలో పెడతానని బెదిరిస్తుండటంతో అసలు విషయం తల్లిదండ్రులకు చెప్పి విలపించింది. పట్టణాలు.. పల్లెల్లోనూ ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్ లేని విద్యార్థులు అరుదు. భద్రత కోసమో లేదా ఇంట్లో పోరు పెడుతున్నారనో తల్లిదండ్రులు చరవాణి కొనిపెడుతున్నారు. దీంతో విద్యార్థులు ప్రతి రోజు తమ స్నేహితులతో మాట్లాడుకునేందుకు ఎక్కువ సమయం సామాజిక మాధ్యమాల్లో గడుపుతున్నారు. ఉపయుక్త సమాచారం వరకు ఫర్వాలేదు కానీ అదే వ్యాపకమైతే ఆ ప్రభావం చదువు, తీసుకునే ఆహారం, వివిధ పనులు, కుటుంబ సంబంధాలపై సైతం ప్రభావం చూపించే అవకాశం ఉంది. ఫేస్‌బుక్, వాట్సప్, స్నాప్ చాట్, షేర్‌చాట్లకు అతుక్కుపోవడం, రీల్స్ చూస్తూ.. చేసేయడం కళాశాలలు, పాఠశాలల విద్యార్థుల్లో మరింత ఎక్కువగా ఉంది. ఇంట్లో తల్లిదండ్రులు, బంధువులు మాట్లాడే సమయంలోనూ వీరు చరవాణిని వదిలిపెట్టడం లేదు కదా.. అవతలి వారి మాటలకు స్పందించడం మానేస్తున్నారు. ఇది విన్నావా అంటే.. ఏదీ.. అని తిరిగి ప్రశ్నించేంతగా అందులో లీనమైపోతున్నారు.

స్వీయ ప్రేరణ మేలు..

చరవాణి మాయా ప్రపంచంలో విహరిస్తున్న వారిలో స్వీయ ప్రేరణ ద్వారానే మార్పు తీసుకొచ్చేందుకు ప్రయత్నించాలి. 'నేను ఫోన్ ఎందుకు వాడుతున్నాను..? వాట్సాప్‌లోనో, ఫేస్‌బుక్‌లోనో ఈ సందేశాన్ని ఎందుకు పెడుతున్నాను..? దీని వల్ల ఏమైనా ఉపయోగం ఉందా..? ఈ యాప్‌ను నిత్య వాడటం వల్ల మానసికంగా ఏదైనా సంతోషం కలుగుతుందా..? లేదా వ్యతిరేక ప్రభావం నాపై పడుతుందా..?' అనే ప్రశ్నలు వారికి వారు వేసుకోవాలి. తద్వారా మంచి నిర్ణయాలు తీసుకోవడంతో పాటు వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ప్రవర్తన మారుతుంది. అంతేకాకుండా అనవసర స్నేహాల జోలికి వెళ్లకుండా తమను తాము నియంత్రించుకుంటారు.

విలువల విత్తనాలు నాటాలి..

చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలు సామాజిక మాధ్యమాల్లో ఉన్నారంటే కంగారు పడిపోతుంటారు. అభద్రతా భావంతో నానా హడావిడి చేస్తుంటారు. వారి నుంచి చరవాణి లాక్కోవడమో.. అంతర్జాల కనెక్షన్ తీసివేయించడమో చేస్తుంటారు. పిల్లలను మంచిదారిలో నడిపించడంలో పెద్దల పాత్ర చాలా ఉంటుంది. ఒక్కసారిగా వారిని మార్చేయాలని కఠిన నిబంధనలు విధించకుండా నెమ్మదిగా మంచి మార్గంలోకి తీసుకురావాలి. వారిలో విలువల విత్తనాలను నాటాలి. ఫోన్ల విషయమనే కాకుండా పిల్లలు చేసే ప్రతి పని విలువలతో కూడి ఉంటుందా లేదా అనే విషయాలను గమనిస్తూ ఉండాలి.

కొంగొత్త హంగులతో 'యాప్'లు..సాంకేతికంగా నేడు వస్తున్న మార్పుల గురించి చాలామంది తల్లిదండ్రు లకు తెలియదు. అనేక రకాల యాప్‌లు కొంగొత్త హంగులతో పలకరిస్తున్నాయి. పిల్లలు అంతర్జాలంలో ఏ యాప్‌లు వినియోగిస్తు న్నదీ, తరచూ ఏం చేస్తున్నదీ, ఏయే పోస్టింగులు పెడుతున్నారనేది కాస్త దృష్టి పెట్టాలి. తద్వారా వారి మానసిక స్థాయి ఎలా ఉందనేది తెలుస్తుంటుంది. ప్రశ్నించే వారికి పిల్లలు ఆమడ దూరంలో ఉంటారు. భయపెడితే మారుతారనుకోవడం పొరపాటే. ' అలా చేయకూడదు. నీకు ఇబ్బందులు వస్తాయి..? మరోసారి ఇలా చేశావో' అంటూ హెచ్చరిస్తూ పోతే వారు ఆ చర్యలను మానకపోగా రహస్యంగా చేస్తుంటారు.

# ఏ శాఖ చూసినా.. అనిశాకు పని పడేలా..!

నల్గొండ : మిర్యాలగూడలోని నూకల వెంకట్‌రెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్‌లో మెడికల్ దుకాణం అనుమతి కోసం రూ.18 వేలు లంచం తీసుకుంటుండగా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సోమేశ్వర్ సోమవారం అనిశాకు చిక్కారు. నల్గొండలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అత్యవసర మందుల ఏజెన్సీని కొనసాగించడానికి సదరు నిర్వాహకుడి వద్ద రూ.3 లక్షలు తీసుకుంటూ ఈ ఏడాది ఫిబ్రవరి 16న ఆసుపత్రి పర్యవేక్షకుడు లావిడి లచ్చునాయక్ అవినీతి నిరోధక శాఖ వలలో పడ్డారు.

గడిచిన మూడు నెలల్లోనే ఉమ్మడి జిల్లాలోని వివిధ శాఖలకు చెందిన ఏడుగురు అధికారులు అనిశాకు చిక్కడం గమనార్హం. ఇందులో యాదాద్రి జిల్లా రవాణా శాఖ అధికారితో పాటూ మోత్కూరు మండలం పొడిచేడులో పనిచేసిన పంచాయతీ కార్యదర్శి వరకు ఉండటం ప్రస్తుత పరిస్థితికి అద్దం పడుతోంది.

ఉమ్మడి నల్గొండ జిల్లాలో ప్రభుత్వ కొలువును అడ్డుపెట్టుకొని ఆదాయానికి మించి ఆస్తులు పోగేస్తున్న పలువురు అక్రమార్కులపై అవినీతి నిరోధక శాఖ (అనిశా) దృష్టి సారించింది. అందులో భాగంగా బాధితుల నుంచి ఫిర్యాదు రావడమే ఆలస్యం...వలపన్ని అక్రమార్కుల భరతం పడుతున్నారు. ఒకప్పుడు రెవెన్యూ, పోలీసు శాఖలకే పరిమిత మైన అవినీతి తిమింగళాలు ప్రస్తుతం అన్ని విభాగాల్లో శాఖోపశాఖ లుగా విస్తరించారు. ప్రతి పనికి ఎంతో కొంత ముట్టజెప్పందే సర్కారు కార్యాలయాల్లో పని జరగడం లేదు. ప్రధానంగా పంచాయతీరాజ్, విద్యుత్, రిజిస్ట్రేషన్, వ్యవసాయ, పురపాలిక, రవాణా, ఆబ్కారీ, నీటిపారుదల శాఖల్లో ఎక్కువగా అవినీతి జరుగుతోందని అనిశా అధ్యయనంలో తేలింది. గతంలో ఎన్నడూ లేని విధంగా గతేడాది మే నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 11 మంది అధికారులు అనిశా వలకు చిక్కడం గమనార్హం. ఇందులో ఎక్కువగా పంచాయ తీరాజ్, విద్యుత్ శాఖకు చెందిన వారు ఉన్నారు.మరికొందరిపైనా దృష్టి గత నాలుగైదేళ్లుగా ఉమ్మడి జిల్లాలో పనిచేస్తూ పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు, ఆబ్కారీ శాఖకు చెందిన నలుగురు అధికారులపై ఇటీవలే అనిశాకు ఫిర్యాదులు అందినట్లు తెలిసింది. ఆబ్కారీ శాఖలో పనిచేస్తూ గత ప్రభుత్వ హయాం నుంచి విచ్చలవిడిగా తన అనుచరులు, అస్మదీయులతో బార్లు నడిపిస్తున్న ఓ రాష్ట్ర స్థాయి అధికారిపైనా ఇప్పటికే పలు ఫిర్యాదులు రావడంతో.. త్వరలోనే ఆయనపై చర్యలు తీసుకునే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ప్రధానంగా రవాణా, ఆబ్కారీ, విద్యుత్ శాఖల్లోని పలువురు కింది స్థాయి సిబ్బందిపైనా ఇటీవల ఫిర్యాదులు అందడంతో వీరిపై అనిశా కొన్ని రోజుల నుంచే దృష్టి సారించినట్లు తెలిసింది. మిర్యాలగూడ రెవెన్యూ డివిజన్‌లో పనిచేస్తున్న పలువురు విద్యుత్ సిబ్బంది, అధికారులు బినామీ గుత్తేదారులుగా చాలా కాలం నుంచి రూ. కోట్ల విలువైన పనులు చేస్తున్నారు. కొన్ని పనులు చేయకున్నా ప్రభుత్వం నుంచి బిల్లులు తీసుకుంటున్నారన్న ఫిర్యాదులు ఏకంగా ప్రభుత్వ పెద్దలకే అందడంతో వీరిపై చర్యలకు రంగం సిద్ధమవుతోంది. గతంలో ఇక్కడ పనిచేసిన ఓ డీఈ స్థాయి అధికారి సొంత శాఖలోని అధికారుల నుంచే రూ.2 లక్షల లంచం తీసుకుంటూ అనిశాకు చిక్కడం విశేషం.ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జిల్లా అధికారుల నుంచి మండల అధికారి వరకు మొత్తం 12 మందిపై సమగ్ర వివరాలు సేకరిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

# నోరూరించే మామిడి.. మార్కెట్‌లో సందడి

హైదరాబాద్: నోరూరించే మామిడి పండ్ల సీజన్ రానేవచ్చింది.. మార్కెట్‌లో మామిడి విక్రయాలు జోరు ఆరంభమైంది. నగర శివారులోని అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారంలోని గడ్డిఅన్నారం పండ్ల మార్కెట్ యార్డులో మామిడి క్రయవిక్రయాలతో సందడి నెలకొంది. మార్కెట్‌లో మామిడి విక్రయాలు సజావుగా సాగేలా ఏర్పాట్లు చేశారు. గతేడాది మామిడి సీజన్‌లో బాటసింగారంలోని పండ్ల మార్కెట్‌లో రూ.239 కోట్ల వ్యాపారం సాగింది.

వివిధ ప్రాంతాల నుంచి రాక..

తెలంగాణలో వివిధ జిల్లాలతో పాటు ఏపీ, కర్ణాటకలోని వివిధ ప్రాంతాలనుంచి బాటసింగారం పండ్ల మార్కెట్‌కు మామిడిని రైతులు తీసుకొస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు 20,900 మెట్రిక్ టన్నుల మామిడి విక్రయానికి వచ్చింది. గతేడాది ఏప్రిల్‌లో 35,000 మెట్రిక్ టన్నుల విక్రయాలు జరిగాయి. గతేడాదితో పోలిస్తే ఇప్పటివరకు మామిడి రాక కొంచెం తక్కువగానే ఉందని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. మార్కెట్‌లో మామిడి ధర టన్ను సగటున రూ.38,000 వేల వరకు పలుకుతోంది. గతేడాదితో పోలిస్తే ఈ ధర కొంచెం ఎక్కువనే వినిపిస్తోంది. మేలు రకం హిమాయత్ మామిడి 20 కిలోల బాక్స్ రూ.4వేలు, బెనిషన్ రూ.1,700 వరకు పలుకుతోంది.

కట్టుదిట్టమైన ఏర్పాట్లు..

సీజన్‌లో బాటసింగారం మార్కెట్‌కు వచ్చే మామిడి క్రయవిక్రయాలు సాఫీగా సాగేందుకు గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్



కార్యదర్శి చిలుక నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. మామిడి క్రయవిక్రయాలకు అనువుగా ప్రత్యేకంగా 12 ఎకరాల ప్రాంగణంలో భారీ షెడ్లు, మరో 7 ఎకరాల్లో వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేశారు. మార్కెట్ ప్రాంగణంలో మామిడి పండ్లతో వచ్చే వాహనాలు సాఫీగా రాకపోకలు సాగించేలా అంతర్గత రోడ్లు నిర్మించారు. మార్కెట్‌లో రైతులు, వ్యాపారులకు తాగునీరు అందించేందుకు 7 శీతల తాగునీటి యంత్రాలు, మామిడి బిడ్డింగ్ తదితరాల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని అందుబాటులో ఉంచారు.

బాటసింగారం బాట పట్టిన మామిడి

రాజధాని శివారు బాటసింగారం పండ్ల మార్కెట్ మామిడి రాశులతో నిండిపోయింది. కర్ణాటక, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి మామిడి లోడ్లతో లారీలు, ట్రాలీలు పోటెత్తాయి. ఇప్పటివరకు సుమారు 20 వేల మెట్రిక్ టన్నులు మామిడి దిగుమతి అయింది. నాణ్యతనుబట్టి టన్నుకు సగటున రూ.38 వేల ధర పలుకుతోంది. ఈ సీజన్ ముగిసే వరకు లక్ష మెట్రిక్ టన్నుల మామిడి మార్కెట్‌కు రానుందని అధికారులు తెలిపారు. మార్కెట్లో కనువిందు చేసిన మామిడి రాశులివి.

# నిర్మాణ వ్యర్థాలా.. మేమే తీసుకెళ్తాం

హైదరాబాద్: ఇంటి నిర్మాణం, మరమ్మతు, కూల్చివేత సందర్భంగా ఉత్పత్తయ్యే వ్యర్థాలను మేమే తీసుకెళ్తామని జీహెచ్‌ఎంసీ ప్రకటించింది. జీహెచ్‌ఎంసీ వెబ్‌సైట్, 'మైజీహెచ్‌ఎంసీ' మొబైల్ యాప్‌లో సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు కమిషనర్ రోనాల్డ్‌రాస్ సోమవారం ప్రకటనలో తెలిపారు. రోడ్ల పక్కన, ఖాళీ స్థలాల్లో, చెరువుల్లో వ్యర్థాలు వేస్తున్న ప్రైవేటు వాహనదారులకు జరిమానా విధిస్తామని ఆయన హెచ్చరించారు.

సేవలు పొందండిలా..

%https://igs.ghmc.gov.in/CNDWaste_Send_ OtpMobile.aspx% వెబ్‌లింకులో ఫోన్ నంబరుతో నమోదై సేవలను పొందవచ్చు. 'మైజీహెచ్‌ఎంసీ' మొబైల్ యాప్‌లో 'కన్‌స్ట్రక్షన్ అండ్ డెమోలిషన్ వేస్ట్' పేరుతో ఉండే లింకుతో సేవలను పొందొచ్చు.

వ్యర్థాలను ఇంటికొచ్చి తీసుకెళ్తే.. టన్ను వ్యర్థాలకు రూ.388.75 నుంచి రూ.435 చొప్పున , నిర్మాణదారు లేదా భవన యజమాని సొంత వాహనాలతో డంపింగ్‌యార్డులకు వ్యర్థాలను తరలిస్తే టన్నుకు రూ.97.2 నుంచి రూ.108.75 చొప్పున నిర్వహణ రుసుము వసూలు చేస్తారు.సర్కిళ్లవారీగా నంబర్లు..

టోల్‌ఫ్రీ 1800-120-1159, వాట్సప్ 91009 27073

ఉప్పల్, హయత్‌నగర్, ఎల్బీనగర్, సరూర్‌నగర్, మలక్‌పేట, సంతోష్‌నగర్, అంబర్‌పేట, యూసుఫ్‌గూడ, శేరిలింగంపల్లి, చందానగర్, ఆర్‌సీపురం-పటాన్‌చెరు, మూసాపేట, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, గాజులరామారం.టోల్‌ఫ్రీ 1800-203-0033, వాట్సాప్ 73300 00203 చాంద్రాయణగుట్ట, చార్మినార్, ఫలక్‌నుమా, రాజేంద్రనగర్, మెహిదీపట్నం, కార్వాన్, గోషామహల్, జూబ్లీహిల్స్, కాప్రా, ముషీరాబాద్, ఖైరతాబాద్, అల్వాల్, మల్కాజిగిరి, సికింద్రాబాద్, బేగంపేట.

## నాణ్యమైన భోజనం అందించడంలో అక్షయపాత్ర కృషి భేష్

నార్సింగి : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంలో అక్షయపాత్ర చేస్తున్న కృషి ప్రశంసనీయమని జెమినీ ఎడిబుల్స్ సేల్స్ అండ్ మార్కెటింగ్ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ పి.చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సీఎస్సార్ కార్యక్రమంలో భాగంగా జెమినీ ఎడిబుల్స్ సంస్థ రూ.రెండు కోట్ల వ్యయంతో అక్షయపాత్ర వంటశాల సామర్థ్యం పెంచడానికి అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంతో పాటు సిద్ధం చేసిన ఆహారాన్ని రవాణా చేయడానికి 3 ఈవీ వాహనాలను సమకూర్చింది. వీటిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశంలో అనేక ప్రాంతాలలో విద్యార్థులకు భోజనం అందిస్తున్న అక్షయపాత్ర సంస్థ ఇటీవల 400 కోట్ల భోజనాలు అందించిన ఘనత సాధించడం అభినందనీయ మన్నారు. అక్షయపాత్ర ఫౌండేషన్ ప్రాంతీయ అధ్యక్షుడు, ట్రస్టీ సత్యగౌర చంద్రదాస మాట్లాడుతూ.. నార్సింగి వంటశాలలో ప్రస్తుతం ఉన్న 35 వేల మందికి వంట తయారీ సామార్థ్యాన్ని 50వేలకు పెంచడానికి అవసరమైన సదుపాయాలను కల్పించడానికి జెమినీ ఎడిబుల్స్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. జెమినీ ఎడిబుల్స్ సేల్స్ అండ్ మార్కెటింగ్ అధికారి రాజేష్ అగర్వాల్, అక్షయపాత్ర సీఈవో శ్రీధర్ వెంకట్ పాల్గొన్నారు.

# గంజాయి మత్తు... యువత చిత్తు



వేములవాడ: గంజాయి విక్రయాలు చాప కింద నీరులా విస్తరిస్తున్నాయి. పట్టణాల్లచినే కాకుండా పల్లెలకు కూడా గంజాయి మత్తు పాకుతోంది. ఫలితంగా చాలా మంది విద్యార్థులు, యువత దీనికి అలవాటు పడి తమ భవిష్యత్తును నాశనం చేసుకోవడం వారి తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేస్తోంది. కొంతమంది గుట్టు చప్పుడు కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వివిధ మార్గాల్లో ఈ ప్రాంతానికి తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు పోలీసు తనిఖీల్లో వెల్లడైంది. వేములవాడ పట్టణం, వేములవాడ గ్రామీణ మండలం, చందుర్తి, రుద్రంగి, కోనరావుపేట మండల కేంద్రాలతోపాటు గ్రామాల్లోనూ విక్రయాలు జోరుగా సాగుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా వేములవాడ పట్టణంలో కొన్ని ప్రాంతాలు గంజాయి, గుట్కాల విక్రయాలకు అడ్డాలుగా మారాయి. వాటి వద్ద యువత ఎప్పుడూ దర్శనమివ్వడం అనుమానాలకు తావిస్తోంది.

వివిధ రూపాల్లో సరఫరా...

కొన్ని పాన్ షాపులు, హోటళ్లు, ఐస్‌క్రీం, సోడా బండ్లు, ఆటోల అడ్డాల వద్ద గంజాయి విక్రయాలు గుట్టు చప్పుడు కాకుండా జరుగుతున్నాయి. సిగరెట్లు, పాన్‌మసాలా వంటి వివిధ రూపాల్లో సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. యువత సిగరెట్లలోని తంబాకును తొలగించి గంజాయి నింపుతూ తాగుతున్నారు. రాత్రి వేళల్లో పాఠశాల ప్రాంతాలు, చెరువు గట్లు, పట్టణ పరిసరాల్లోని బహిరంగ ప్రదేశాలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో తాగుతున్నారు. గతంలో పట్టుబడిన యువతను పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపినప్పటికీ మార్పు రావడం లేదు. దీనికి బానిసలైన వారు ఎక్కడ లభిస్తే అక్కడికెళ్లి తాగుతున్నారు. తాజాగా వేములవాడ పట్టణానికి చెందిన అయిదుగురు యువకులు గంజాయి విక్రయిస్తుండగా పట్టుకొని అరెస్టు చేయడంతో ఈ రాకెట్ మరోసారి వెలుగులోకి వచ్చింది. వీరు యువతే లక్ష్యంగా పెద్ద ఎత్తున అమ్మకాలు చేపడుతున్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన శ్యామ్‌దివాకర్ అక్కడి నుంచి వేములవాడ ప్రాంతానికి తీసుకొచ్చి తమ స్నేహితులతో విక్రయాలు చేస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. గంజాయికి బానిసవుతున్న వారిలో ఎక్కువ శాతం యువత, చిన్నారులు, విద్యార్థులు, ఉండటం గమనార్హం.

యువత తల్లిదండ్రుల్లో ఆందోళన

కొంత మంది విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే గంజాయిని సరదా కోసం తాగి క్రమంగా బానిసలవుతున్నారు. తరవాత వారి ప్రవర్తనలో మార్పు కనిపించి జరిగిన విషయం తెలుసుకొని తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. విక్రయదారులు కొందరు విద్యార్థులు, యువతనే లక్ష్యంగా చేసుకొని దందాను గుట్టు చప్పుడు కాకుండా కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. వేములవాడ పట్టణంలో సరఫరాదారులు చాలా మంది ఉన్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. దీనిని తాగిన యువత తమ ద్విచక్రవాహనాలను అతి వేగంగా నడిపిస్తూ రోడ్లపై వెళ్లే ఇతరులను భయాందోళనకు గురి చేస్తున్నారు. పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులు పూర్తి స్థాయిలో నిఘా పెట్టకపోవడం వల్లే వీటి అమ్మకాలు విస్తరిస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు పూర్తిస్థాయిలో అరికట్టేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

నియంత్రణకు చర్యలు

గంజాయి సరఫరాను అరికట్టేందుకు నిఘా పెట్టడం జరిగింది. గంజాయి విక్రయించినా, తాగినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకొంటాం. యువత గంజాయికి బానిసై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు. తల్లిదండ్రులు వారి పిల్లలపై దృష్టి పెట్టాలి.నాగేంద్రచారి, డీఎస్పీ, వేములవాడ

# సరిహద్దులు దాటుతున్న రేషన్ బియ్యం



గోదావరిఖని : ఈనెల 10న మంథని పట్టణంలో 28 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని వ్యాన్‌లో తరలిస్తుండగా పౌరసరఫరాల శాఖ అధికారులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. తాజాగా సైతం మంథని పట్టణంలోని ఆర్టీసీ డిపో సమీపంలో రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యాన్‌ను పట్టుకున్నారు. 25 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

పరకాల నుంచి గుజరాత్‌కు తరలించేందుకు రవాణా చేస్తున్న రేషన్ బియ్యాన్ని ఇటీవల హుజూరాబాద్ శివారులో పోలీసులు తనిఖీ చేసి పట్టుకున్నారు. లారీని పౌరసరఫరాల అధికారులకు అప్పగించారు. భారీ మొత్తంలో ఒక రైస్‌మిల్లు నుంచి బియ్యాన్ని లోడ్‌చేసి లారీలో గుజరాత్‌కు తరలిస్తున్నట్లు గుర్తించారు.

ఉమ్మడి జిల్లాలో కొంత కాలంగా సద్దుమనిగిన రేషన్ బియ్యం అక్రమ రవాణా మళ్లీ సాగుతోంది. పేద ప్రజల కోసం ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బియ్యాన్ని సేకరిస్తున్న కొంత మంది మహారాష్ట్ర, గుజరాత్‌లోని పలు ప్రాంతాలకు తరలించి భారీ మొత్తంలో అక్రమంగా సంపాదిస్తున్నారు. రేషన్ దుకాణాల నుంచి కొంత మంది సేకరిస్తుండగా మరి కొంత మంది లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. లారీల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలించి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. మహారాష్ట్రలో బియ్యానికి డిమాండ్ ఎక్కువగా ఉండటంతో అక్కడికి రవాణా చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 413 రేషన్ దుకాణాల ద్వారా నెలకు 3,500 క్వింటాళ్ల బియ్యాన్ని లబ్ధిదారులకు సరఫరా చేస్తున్నారు. 2,21,956 రేషన్ కార్డులు ఉండగా 6,40,250 మంది లబ్ధిదారులున్నారు. ఉమ్మడి జిల్లాలో సరఫరా చేస్తున్న రేషన్ బియ్యంలో కొద్ది మంది లబ్ధిదారులు మాత్రమే వాటిని తీసుకుంటుండగా మిగతా చాలామంది బయటి వ్యక్తులకు విక్రయిస్తున్నారు. కొన్ని రేషన్ దుకాణాల్లో డీలర్లే ఎంతోకొంత ఇచ్చి లబ్ధిదారుల నుంచి సేకరించి బ్లాక్‌మార్కెట్‌కు తరలిస్తున్నారు. ఇది చాలాకాలంగా సాగుతున్న దందా. ఇటీవల కొంత కాలంగా సద్దుమణిగినా మళ్లీ మొదలైంది.

మండలాల వారీగా సేకరణ

రేషన్ బియ్యం అక్రమంగా రవాణా చేసేందుకు మండలానికి కొంత మందిని దళారులు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఆయా ప్రాంతాల్లో సేకరించిన బియ్యాన్ని భారీ మొత్తంలో విక్రయించే మరో దళారికి అందజేస్తున్నారు. గ్రామాలు, పట్టణాల్లో కిలోకు రూ.8 చొప్పున కొనుగోలు చేస్తున్నవారు బడా వ్యాపారికి రూ.10కి విక్రయిస్తున్నారు. వీటిని లారీల్లో లోడ్ చేసి ఇతర రాష్ట్రాలకు రవాణా చేసే అక్రమ వ్యాపారి అక్కడ రూ.15 నుంచి రూ.18 వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాలో సేకరించిన బియ్యాన్ని మంచిర్యాల కేంద్రంగా పలువురు ఇతర రాష్ట్రాలకు రవాణా చేస్తున్నారు.

పెరిగిన పోటీ

ఇటీవల రేషన్ బియ్యం అక్రమ దందా చేసే వారిలో పోటీ పెరగడంతో ఒకరిపై ఒకరు పోలీసులకు సమాచారం ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవలి కాలంలో ఎక్కువ శాతం రేషన్ బియ్యం పట్టుబడుతుండటం వెనుక అక్రమ వ్యాపారుల మధ్య నెలకొన్న పోటీ కారణమై ఉంటుందని పలువురు భావిస్తున్నారు. గతంలో కొంతమంది మాత్రమే దందా చేయగా ఆర్జన అధికంగా ఉండటంతో చాలామంది రేషన్‌బియ్యం అక్రమ రవాణాకు మొగ్గు చూపుతున్నారు. వ్యాపారం పెరగడం.. తమకు రావాల్సిన బియ్యం మరో వ్యాపారి వద్దకు వెళ్తుండటంతో కొందరు పోలీసులకు సమాచారం ఇస్తున్నారు. దీంతో ఇటీవలి కాలంలో ఎక్కువగా రేషన్ బియ్యం పట్టుబడుతోంది.

ఇతర రాష్ట్రాలకు...

ఉమ్మడి జిల్లా నుంచి ఎక్కువ శాతం మహారాష్ట్రకు రోడ్డు మార్గంతో పాటు రైలు మార్గంలో రేషన్ బియ్యాన్ని తరలిస్తూ పలువురు అక్రమ దందా సాగిస్తున్నారు. పెద్దపల్లి, రామగుండం, జమ్మికుంట రైల్వేస్టేషన్లకు బస్తాలను చేర్చి గుట్టుచప్పుడు కాకుండా రైలులో వేసి తరలిస్తున్నారు. సీట్ల కింద బస్తాలను వేసి తమ గమ్యస్థానం రాగానే వాటిని కిందకు దించుతున్నారు. ఎవరైనా పట్టుకుంటే తమకు సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. రోడ్డు మార్గంలో అయితే వాహనాల ద్వారా రవాణా చేస్తూ చెక్‌పోస్టుల వద్ద సిబ్బందికి మామూళ్లు ముట్టచెబుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# పల్లెల్లో గాడి తప్పిన ప్రత్యేక పాలన

కరీంనగర్ : రామడుగులో మురుగుకాలువల్లోని పూడికను రోడ్డుపై వేయడం, రోజుల తరబడి తరలించకపోవటంతో ఆ చెత్తను పందులు, కోళ్లు చిందర వందర చేస్తున్నాయి. బాటసారులకు అసౌకర్యం కలుగుతోంది.కరీంనగర్ గ్రామీణ మండలం ఇరుకుల్లలో మిషన్ భగీరథ పైపు పగిలి 15 రోజులుగా మురుగు నీరు వస్తోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు పరిశీలించినా సమస్య పరిష్కారానికి నోచలేదు.కొత్తపల్లి మండలం చింతకుంటలోని శాంతినగర్‌లో వీధి దీపాలు వెలగకపోవటంతో కాలనీవాసులు రాత్రి సమయంలో ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాలోని గ్రామాల్లో సర్పంచుల పదవీకాలం రెండు నెలల కిందట పూర్తయింది. అప్పటి నుంచి ప్రత్యేకాధికారుల పర్యవేక్షణలో పాలన కొనసాగుతోంది. వేర్వేరు శాఖల నుంచి ప్రతి గ్రామానికి ప్రత్యేక అధికారిని కేటాయించారు. వారిలో కొందరికి గ్రామాలపై అవగాహన లేకపోవడం, ఇతర బాధ్యతలు.. తదితర కారణాలతో పర్యవేక్షణ కొరవడింది. తాగునీటి సరఫరాలో లోపాలు, పారిశుద్ధ్యం కొరవడటం తదితర లోపాలు వెలుగుచూస్తున్నాయి. చిన్న చిన్న సమస్యలతో గ్రామస్థులు ఇబ్బంది పడుతున్నారు.

నిధుల లేమితో..జిల్లాలోని 313 గ్రామపంచాయతీలకు జనాభా ప్రాతిపదికన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయిస్తున్నాయి. కానీ ఏడాదిగా రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు(ఎస్ఎఫ్‌సీ) రాక, చాలీచాలని జనరల్ నిధులతో నెట్టుకు రావటం ప్రత్యేక అధికారులకు తలకు మించిన భారంగా మారింది. సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో ప్రత్యేక అధికారులకు పాలుపోవడంలేదు. ఎన్నికలకు ముందు 15వ ఆర్థిక సంఘం నిధులు కొద్ది మొత్తంలో మంజూరు చేసినా అవి సరిపోలేదు. ఎక్కడి సమస్యలు అక్కడే అన్న



చందంగా గ్రామాల పరిస్థితి తయారైంది.

సిబ్బందికి అందని జీతాలు

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టే మల్టీపర్పస్ వర్కర్ల జీతాలు నిధుల లేమితో కొన్ని పంచాయతీల్లో నెలలుగా అందటం లేదు. వారి కుటుంబాలను నెట్టుకు రావటం కష్టంగా మారి.. విధుల నిర్వహణపై నిరాసక్తతతో ఉన్నారు. బ్యాంకు రుణంతో కొనుగోలు చేసిన పంచాయతీ ట్రాక్టర్‌కు కిస్తీలు కట్టడానికి ప్రత్యేక అధికారులు నానా యాతన పడుతున్నారు. వాయిదాలు సరిగా చెల్లించటంలేదని కొన్ని పంచాయతీలకు బ్యాంకర్లు నోటీసులు సైతం జారీ చేసినట్లు సమాచారం.

ఎద్దడి నివారణకు రూ.6.58 కోట్లు

వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవడానికి జిల్లాకు ప్రత్యేక నిధుల కింద రాష్ట్ర సర్కారు రూ.6.58 కోట్లు కేటాయించటంతో కొంత ఊరట లభించినట్లయింది. ఈ నిధులతో ప్రత్యేక పైపులైన్లు, బోరు బావుల మరమ్మతులు, నూతన బోరుబావుల ఏర్పాటు, వ్యవసాయ బావులను అద్దెకు తీసుకొని నీటి సరఫరా చేయటం వంటి పనులు చేస్తున్నారు.

# కోడ్ కూశాక.. కూత మొదలు

హైదరాబాద్: నగరానికి నాలుగో రైల్వేస్టేషన్‌గా చర్లపల్లి సిద్ధమైంది. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే మొత్తం 6 ప్లాట్‌ఫాంలతో పాటు.. రైళ్ల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. స్టేషన్ భవనంలో టికెట్ కౌంటర్లు, కార్యాలయం సిద్ధమైంది. స్టేషన్‌కు ఇరువైపులా రాకపోకలు సాగించేందుకు వీలుగా రహదారుల నిర్మాణం జరుగుతోంది. ఇక్కడి నుంచి తొలుత 6 ఎక్స్‌ప్రెస్‌లు నడపనుండగా.. వారం, పది రోజుల్లోనే 25 జతల దూరప్రాంత రైళ్లను నడపడానికి స్టేషన్‌ను సిద్ధం చేస్తున్నారు. రూ.430 కోట్లకు పైగా వెచ్చించి ఈ రైల్వేస్టేషన్‌ను తీర్చిదిద్దారు.

సిద్ధమైన రైల్వే ప్లాట్‌ఫాంలు..

గతంలో రెండు ప్లాట్‌ఫాంలు.. మూడు రైల్వేలైన్లుగా ఉన్న చర్లపల్లిలో ఇప్పుడు 9 ప్లాట్‌ఫాంలు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే 24 రైల్వే బోగీలు పట్టే విధంగా 5 ప్లాట్‌ఫాంలు అందుబాటులోకి రాగా.. మరో 4 ఎత్తయిన ప్లాట్‌ఫామ్‌లు అందుబాటులోకి వస్తున్నాయి.



12 మీటర్ల వెడల్పుతో రెండు పాదచారుల వంతెనలు రానుండగా.. 6 మీటర్ల వెడల్పుతో మరొకటి కూడా సిద్ధమవుతోంది. 9 ప్లాట్‌ఫాంలలో మొత్తం 7 లిఫ్టులు, 6 ఎస్కలేటర్లు ఏర్పాటు చేశారు. కోచ్ నిర్వహణ వ్యవస్థతో పాటు.. ఎంఎంటీఎస్ రైళ్లకు ఎలాంటి ఆటంకం లేకుండా రెండు ప్లాట్‌ఫాంలు అందుబాటులోకి రానున్నాయి. స్టేషన్ బయట బస్సుబేలు, ప్రవేశ మార్గాలు, 4-వీలర్, 3-వీలర్ మరియు టూ-వీలర్ వాహనాలకు తగిన స్థలం, 24 గంటలు సీసీటీవీ వ్యవస్థ ఏర్పాటు చేశారు.

చర్లపల్లి నుంచి నేరుగా బయటికి..

చర్లపల్లి రైల్వేస్టేషన్ నుంచి రైళ్ల రాకపోకలు ప్రారంభిస్తే.. రైళ్ల ఆలస్యానికి కట్టడి వేయవచ్చు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌తో సంబంధం లేకుండా రైలు ప్రయాణాలు సాగిపోతుంటాయి. ఉదాహరణకు లింగంపల్లి నుంచి బయలుదేరే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, గౌతమి, జన్మభూమి ఇలా పలు రైళ్లు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్లకుండానే గమ్యస్థానాలకు చేరేందుకు అవకాశం ఉంది. భవిష్యత్తులో లింగంపల్లి తర్వాత హైటెక్‌సిటీ రైల్వే స్టేషన్‌లో ఈ రైళ్లు ఆగి సనత్‌నగర్ – మౌలాలి మీదుగా చర్లపల్లి చేరుకునే వెసులుబాటు కలగనుంది. అలాగే విజయవాడ మీదుగా వచ్చే రైళ్లు కాచిగూడ స్టేషన్‌మీదుగా బెంగళూరు, కర్నూలువైపు వెళ్లే రైళ్లు కూడా సికింద్రాబాద్ స్టేషన్‌కు చేరకుండా వెళ్లడానికి వీలు కలుగుతుంది. 50 శాతం ప్రయాణికులు ఇక్కడి నుంచి రాకపోకలు సాగించే అవకాశం ఉంది. కాచిగూడ రైల్వేస్టేషన్ నుంచి బెంగళూరు వెళ్లే రైళ్లతో పాటు.. విశాఖపట్నం, విజయవాడ వెళ్లే రైళ్లను కూడా అక్కడి నుంచి పంపేందుకు సిద్ధం చేస్తున్నారు. ఇవి నేరుగా మల్కాజిగిరి రైల్వే స్టేషన్లో ఆగేట్టు చూస్తున్నారు. అలాగే మౌలాలి రైల్వే స్టేషన్లో ఆగేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

## పొగచూరుతున్న ఉజ్వల

హైదరాబాద్ : ఉజ్వల గ్యాస్ కనెక్షన్ల జారీ కోసం అర్హులు ఎదురుచూస్తున్నారు. రాజధాని పరిధిలో రెండేళ్లుగా ఈ పథకం కింద కొత్త కనెక్షన్లు ఇచ్చిన దాఖలాలు లేవు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారిలో చాలామంది ఇప్పటికీ కట్టెల పొయ్యి మీదే వంట చేసుకుంటున్నారు. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలతో పాటు హైదరాబాద్‌లోని కొన్ని మురికివాడల్లో ఈ పరిస్థితి ఉంది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న నిరుపేదల్లో అంత్యోదయ అన్నయోజన కార్డుదారులకు ఈ పథకం వర్తిస్తుంది. మహిళల పేరు మీద కనెక్షన్ జారీ చేస్తారు. మూడు జిల్లాల్లో మొత్తం లక్ష మంది కార్డుదారులు ఉండగా కనెక్షన్ల సంఖ్య 30వేలు కూడా దాటకపోవడం గమనార్హం. కొత్తగా దరఖాస్తు చేసుకున్నా ఆయిల్ కంపెనీల డిస్ట్రిబ్యూటర్లు కొర్రీలు పెట్టి తిరస్కరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీంతో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి అర్హులను గుర్తించాలని పేదలు కోరుతున్నారు.

కనెక్షన్ ఉచితంగానే..సాధారణంగా ఎల్పీజీ కనెక్షన్ పొందాలంటే డిపాజిట్, కనెక్షన్ ఛార్జీలు, గ్యాస్ ఫిల్లింగ్, రెగ్యులేటర్, స్టవ్‌తో కలిపి సుమారు రూ.4-5 వేల వరకు ఖర్చవుతుంది. నిరుపేదలు అంతపెట్టి తీసుకునే సాహసం చేయడం లేదు. ఈ నేపథ్యంలో వీరికి పొగబాధ



లేకుండా ఉండేందుకు ఉచిత గ్యాస్ కనెక్షన్ ఇవ్వాలని కేంద్ర సర్కారు సంకల్పించింది. ఇందులో భాగంగా గ్యాస్ కనెక్షన్, సిలిండర్, స్టవ్‌ను నిరుపేద మహిళలకు అందిస్తున్నారు. 2016లో ఈ పథకం అమల్లోకి వచ్చింది దేశవ్యాప్తంగా కోట్లాది మంది పేదలకు ఇవ్వాలని నిర్ణయించారు. రాష్ట్రానికి ఎన్ని కనెక్షన్లు కేటాయించారు? లబ్ధిదారుల ఎంపిక వంటి అంశాలపై అవగాహన కల్పించడం లేదు.

నిబంధనలు ఇలా: 18 ఏళ్లు దాటిన మహిళలు దరఖాస్తుకు అర్హులు. వలస కూలీలు ఫ్యామిలీ డిక్లరేషన్, చిరునామా ధ్రువీకరణ ఇస్తే చాలు. వారి కుటుంబానికి చెందిన ఎవరి పేరుమీద ఎల్పీజీ కనెక్షన్ ఉండకూడదు.

దరఖాస్తు విధానం ఇలా..

ఈ పథకానికి ఆన్‌లైన్‌లో లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేయొచ్చు. దగ్గర్లో ఉన్న ఎల్పీజీ డిస్ట్రిబ్యూషన్ ఏజెన్సీకి వెళ్లి దరఖాస్తు ఇవ్వాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలంటే %https://pmujjwalayojana.com% వెబ్‌సైట్‌లో అప్లికేషన్ ఫామ్ నింపి సబ్మిట్ చేయాలి. ఆ ప్రింట్ తీసుకుని సమీప ఎల్పీజీ డిస్ట్రిబ్యూషన్ ఏజెన్సీలో అందించాలి.



## ఐరాసలో భారత్‌కు వీటో మస్క్ ప్రతిపాదన.. అమెరికా స్పందన

వాషింగ్టన్: భద్రతా మండలి సహా ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థల్లో సంస్కరణలకు అమెరికా అనుకూలమేనని అధ్యక్షుడు బైడెన్ అడ్మినిస్ట్రేషన్ బుధవారం స్పష్టం చేసింది. యూఎన్‌ఎస్సీలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం లేకపోవడాన్ని బిలియనీర్ ఎలాన్ మస్క్ ఇటీవల ప్రస్తావించిన విషయం తెలిసిందే. దీనిపై స్పందిస్తూ అగ్రరాజ్య విదేశాంగశాఖ అధికార ప్రతినిధి వేదాంత్ పటేల్ పై వ్యాఖ్యలు చేశారు. "ఐరాసలో సంస్కరణలపై అధ్యక్షుడు బైడెన్ గతంలో సర్వప్రతినిధి సభలో మాట్లాడారు. విదేశాంగ మంత్రి కూడా అందుకు మద్దతిచ్చారు. భద్రతా మండలి సహా ఐరాస సంస్థల్లో సంస్కరణలకు మేం ఎప్పుడూ అనుకూలమే. ఐరాసలో ప్రాతినిధ్యం 21వ శతాబ్దపు ప్రపంచాన్ని ప్రతిబింబించేలా ఉండాలి" అని మీడియా సమావేశంలో వేదాంత్ పటేల్ అన్నారు. UNSCలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం లేకపోవడం అసంబద్ధమని ఎలాన్ మస్క్ జనవరిలో ఓ సందర్భంగా వ్యాఖ్యానించారు. అత్యధిక జనాభా ఉన్న దేశానికి ప్రాతినిధ్యం లేకపోవడానికి తప్పుబట్టారు. ఆఫ్రికా దేశాలన్నింటికీ కలిపి కూడా ప్రాతినిధ్యం ఉండాల్సిన అవసరం ఉందన్నారు. వర్ధమాన దేశాల ప్రయోజనాలు కాపాడేందుకు సెక్యూరిటీ కౌన్సిల్‌లో శాశ్వత సభ్యత్వం ఉండాల్సిన అవసరం ఉందని భారత్ సుదీర్ఘకాలంగా డిమాండ్ చేస్తూ వస్తోంది. దీనికి అంతర్జాతీయ సమాజం సైతం మద్దతునిస్తుండడం విశేషం.

యూఎన్‌ఎస్సీలో మొత్తం 15 దేశాలకు సభ్యత్వం ఉ ంటుంది. వీటిలో చైనా, యూకే, ఫ్రాన్స్, రష్యా, అమెరికాకు శాశ్వత సభ్యత్వం పేరిట వీటో అధికారం ఉంది. మరో పది దేశాలు రెండేళ్ల కాలపరిమితితో తాత్కాలిక సభ్యదేశాలుగా ఎన్నికవుతూ ఉంటాయి. ఐరాసలో శాశ్వత సభ్యత్వం కోసం చర్యలు తీసుకుంటామని ఇటీవల విడుదలైన మేనిఫెస్టోలో భాజపా హామీ ఇచ్చిన విషయం తెలిసిందే.

## కేసీఆర్ జోలికి వస్తే తన్ని తరిమేస్తామన్న మాజీ మంత్రి



నల్గొండ, ఏప్రిల్ 18: "నేను నిఖార్సయిన ఉద్యమకారుడిని, ఫైటర్‌ను.. ప్రజల కోసం ఎన్ని సార్లు అయినా జైలుకి పోయే దమ్మున్న నాయకుడిని. నన్ను విమర్శించే అర్హత కోమటిరెడ్డి సోదరులకు లేదు. కోమటిరెడ్డి సోదరులకు నడిమంతరపు సిరి వచ్చి కింద మీద ఆగడం లేదు. కోమటిరెడ్డి సోదరులకు బ్రోకర్లు అని పేరుంది" అంటూ కోమటిరెడ్డి సోదరులపై మాజీ మంత్రి జగదీష్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గురువారం నల్గొండలో నిన్న (బుధవారం) రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జనార్ధన్ రావు మృతదేహానికి జగదీష్ రెడ్డి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నల్గొండ జిల్లా అన్నదాతలను మోసం చేసి, సాగర్ నీళ్లను ఆంధ్రకు అమ్మి అప్పటి సీఎం వైఎస్ఆర్ వద్ద కోమటిరెడ్డి సోదరులు ముడుపులు తీసుకున్నారని ఆరోపించారు. రేవంత్ బూట్లు తుడుస్తున్నారు కోమటిరెడ్డి అన్నదమ్ములు అంటూ వ్యాఖ్యలు చేశారు. "నా చరిత్ర ఎంటో, మీ చరిత్ర ఏంటో చర్చ పెడదామా" అంటూ సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముమ్మాటికీ బీజేపీ మనిషే అని.. బీజేపీలోకి పోతాడని కాంగ్రెస్ మంత్రులే లీక్‌లు ఇస్తున్నారన్నారు. కేసీఆర్ జోలికి వస్తే తన్ని తరిమేస్తామని జగదీష్ రెడ్డి హెచ్చరించారు.

## బీజేపీకి రూ.500 కోట్లు ఇచ్చినందుకే శరత్ చంద్రారెడ్డికి బెయిల్



కరీంనగర్: బీజేపీకి ఐదు వందల కోట్లు ఇచ్చినందుకే అరెస్టయిన అరబిందో డైరెక్టర్ పెనక శరత్ చంద్రారెడ్డికి బెయిల్ మంజూరైందని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బాండ్ల విషయంలో బీజేపీ సమర్ధించుకుంటున్న తీరు గర్హనీయమన్నారు. అవినీతి డబ్బు పార్టీలకు వస్తే అది నీతివంతంగా మారిపోతుందా? అని ప్రశ్నించారు. కరీంనగర్‌లో కాంగ్రెస్ గెలుపు ఖాయమన్నారు. తెలంగాణ ప్రయోజనాలకు బీజేపీ సహకరించలేదన్నారు. తెలంగాణకు బీజేపీ ఏం ఇచ్చిందో చెప్పాలని పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. వేములవాడ, కొండగట్టు ప్రసాదం స్కీం కింద ఒక్క రూపాయి అయినా ఆయన తీసుకు వచ్చారా అని ప్రశ్నించారు. రాముడి పేరు మీద రాజకీయం చేస్తున్నారని పొన్నం మండిపడ్డారు. రాముడిపై తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదన్నారు. ఒకవేళ తాను రాముడి గురించి తప్పుగా ఏమైనా మాట్లాడినట్టు బీజేపీ ఎంపీ బండి సంజయ్ నిరూపిస్తే తాను సజీవ దహనానికి సైతం సిద్ధమన్నారు. తాము రాముడిని ఆరాధిస్తాం కానీ రాజకీయాలు చేయబోమని తెలిపారు. తెలంగాణలో ఐదేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వం సుస్థిరంగా ఉంటుందని పొన్నం వ్యాఖ్యానించారు.

## అందుబాటులోకి మరిన్ని ఎలక్ట్రిక్ నాన్ ఏసీ బస్సులు.. డిసెంబర్ నాటికి వెయ్యి

హైదరాబాద్ సిటీ: గ్రేటర్‌లో బస్సుల సంఖ్య పెంచుకోవడమే లక్ష్యంగా ఆర్టీసీ చర్యలు తీసుకుంటోంది. ఈ మధ్య అందుబాటులోకి తెచ్చిన 23 ఎలక్ట్రిక్ నాన్ ఏసీ బస్సుల్లో ఆక్యూపెన్సీ 80-90 శాతం నమోదవుతోంది. వీటికి ప్రయాణికుల నుంచి ఆదరణ లభిస్తుండడంతో అదే తరహాలో విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి 125-150 బస్సులను అందుబాటులోకి తెచ్చే దిశగా ఆర్టీసీ ప్రయత్నా లు చేస్తోంది. ఎలక్ట్రిక్ బస్సులకు దేశవ్యాప్తంగా డిమాండ్ నెలకొనడంతో బస్సుల రాకలో కొంత జాప్యం జరుగుతోందని ఆర్టీసీకి చెందిన ఓ ఉన్నతాధికారి తెలిపారు. మహాలక్ష్మి ప్రయాణంతో ప్రయాణికుల రద్దీ భారీగా పెరిగింది. ఈ పథకానికి ముందు సిటీబస్సుల్లో రోజుకు ఐదు లక్షల మంది మహిళలు ప్రయాణాలు సాగిస్తే మహాలక్ష్మి పథకంతో రోజు వారీ మహిళా ప్రయాణికుల సంఖ్య 11 లక్షలకు పెరిగింది. రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచేందుకు ఉన్న అవకాశాలపై టీఎస్ ఆర్టీసీ ప్రత్యేక దృష్టి సారించిందని ఉన్నతాధికారులు చెబుతున్నారు. 2019కి ముందు గ్రేటర్‌జోన్‌లో ఆర్టీసీ 3,800 బస్సులు నడుపుతూ రోజుకు 33 లక్షల మంది ప్రయాణికులకు సేవలందించిం ది. ప్రస్తుతం 2,661 బస్సులతో రోజుకు 21 లక్షల మంది ప్రయాణికులకు సేవలందిస్తోంది. 2024 డిసెంబర్ నాటికి 450 ఎలక్ట్రిక్ బస్సులు మరో 500కు పైగా డీజిల్ బస్సులను అందుబాటులోకి తెచ్చే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు టీఎస్ ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. ఎలక్ట్రిక్ బస్సులు పెంచుకుంటే డీజిల్ ఖర్చుల భారం తగ్గడంతోపాటు ఆదాయం పెరుగుతుందని ఆర్టీసీ ఉన్నతాధికారులు చెబుతున్నారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194

## నేటి నుంచి సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారం.. షెడ్యూల్ ఇదే..



హైదరాబాద్: ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. శుక్రవారం ఉదయం మహబూబ్ నగర్‌లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వంశీచంద్ రెడ్డి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం మహబూబాబాద్‌లో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. శనివారం మెదక్ అభ్యర్థి నీలం మధు నామినేషన్ కార్యక్రమంలో సీఎం పాల్గొంటారు. శనివారం (20వ తేదీ) సాయంత్రం కర్ణాటకలో సీఎం రేవంత్ రెడ్డి ప్రచారం చేయనున్నారు. 21న భువనగిరిలో పార్టీ అభ్యర్థి చామల కిరణ్ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొంటారు. 22వతేదీ ఉదయం ఆదిలాబాద్‌లో నిర్వహించే కాంగ్రెస్ సభలో రేవంత్ రెడ్డి పాల్గొంటారు. 23న నాగర్ కర్నూల్ జరిగే బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. 24వ తేదీ ఉదయం జహీరాబాద్, సాయంత్రం వరంగల్‌లో నిర్వహించే సభల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగిస్తారు.

కాగా లోక్‌సభ ఎన్నికలకు అసలైన ఘట్టం మొదలైంది. గురువారం నుంచి నామినేషన్ల ప్రక్రియ షురూ కానుంది. ఇప్పటికే ప్రచారంలో ముందున్న పార్టీలు, అభ్యర్థులు నామినేషన్లు వేయనున్నారు. ఇందుకు రాజేంద్రనగర్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేకంగా రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. నిర్ణీత తేదీల్లో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఆర్వో నామినేషన్లు స్వీకరిస్తారు. ఈ నెల 25 వరకు నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం ఉంటుంది. ప్రభుత్వ సెలవు దినాల్లో నామినేషన్లు తీసుకోరు. అభ్యర్థులు నామినేషన్ వేసే సమయంలో ఐదుగురిని మాత్రమే లోపలికి అనుమతించనున్నారు. అభ్యర్థులు 25ఏళ్లు నిండిన వారై, ఓటు హక్కు కలిగి ఉండాలి. అయితే అతడు/ఆమె పోటీచేసే నియోజకవర్గంలోని ఐదుగురు ఓటర్లు ప్రతిపాదించాల్సి ఉంటుంది. అభ్యర్థులు గానీ, వారి ప్రతిపాదకులు గానీ నామినేషన్ దాఖలు చేయొచ్చు. నామినేషన్‌తో పాటు అభ్యర్థుల ఆస్తులు, అప్పులు, క్రిమినల్ కేసులు, విద్యార్హతలకు సంబంధించిన అఫిడవిట్లు సమర్పించాలి. ప్రతీ అభ్యర్థి నామినేషన్ ప్రక్రియ మొత్తాన్ని వీడియో రికార్డింగ్ చేస్తారు. నామినేషన్ కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఒక అభ్యర్థి గరిష్టంగా నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేయవచ్చు. అయితే అన్నింటికీ కలిపి డిపాజిట్ డబ్బు ఒకసారి చెల్లిస్తే సరిపోతుంది. నామినేషన్ కేంద్రం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సమయంలో 100 మీటర్ల పరిధిలో మూడు వాహనాలనే అనుమతిస్తారు. నామినేషన్ల దాఖలు నుంచి అభ్యర్థుల ఖర్చు లెక్కించనున్నారు. పత్రికల్లో ప్రకటనలు, పెయిడ్ న్యూస్, ఇతర ఖర్చులు అభ్యర్థి ఖర్చు కింద వేస్తారు. వీడియో సర్వేయలెన్స్ టీంలు చిత్రీకరించిన వీడియోలను వీవింగ్ టీంలు పరిశీలించి అకౌంటింగ్ టీంకు పంపుతారు. ఐటీ, జీఎస్టీ, బ్యాంకింగ్, ఎంసీఎంసీ, ఎక్సైజ్ తదితర జాబితాలను పరిశీలిస్తారు. వ్యయాలను నమోదు చేసి ఎన్నికల పరిశీలనకు వచ్చే వ్యయ పరిశీలకులకు ఎప్పటికప్పుడు నివేదిక అందజేస్తారు. ఇప్పటికే ఓటరు జాబితా సవరణ, పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు, పోలింగ్ సిబ్బందిని కేటాయించారు. నామినేషన్ కేంద్రంలో తాగునీటి సౌకర్యం కల్పించారు. ఎండలు దంచి కొడుతుండటంతో నామినేషన్ కేంద్రం వద్ద ఆచ్ఛాదనగా ఉండేలా టెంట్లు వేశారు. ప్రతీ లోక్‌సభ అభ్యర్థి గరిష్ఠంగా రూ.95లక్షల వరకు మాత్రమే ఖర్చు చేయాల్సి ఉంటుంది. అభ్యర్థులు రూ.10వేల వరకు మాత్రమే నగదు రూపంలో ఖర్చు చేయవచ్చు. అంతకన్నా ఎక్కువ ఖర్చు పెడితే చెక్‌రూపంలో లేదా ఆన్‌లైన్ ద్వారా చెల్లించాల్సి ఉంటుంది.



## సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఫిర్యాదు.. కేసీఆర్ అన్న కుమారుడిపై మరో కేసు

హైదరాబాద్: మాజీ సీఎం, భారాస అధినేత కేసీఆర్ అన్న కుమారుడు కన్నారావుపై మరో కేసు నమోదైంది. ఆయనతో పాటు ఐదుగురిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. తనను బెదిరించి డబ్బు తీసుకున్నట్లు ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వారిపై ఫిర్యాదు చేశాడు. గెస్ట్‌హౌస్‌లో నిర్బంధించి దాడి చేశారని అందులో పేర్కొన్నాడు. ఓ సమస్య పరిష్కారం కోసం కన్నారావు వద్దకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి విజయవర్ధన్ రావు వెళ్లారు. కన్నారావుకు పరిచయస్తురాలైన నందిని.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వద్ద నగలు, నగదు ఉన్నాయన్న విషయం ఆయనకు తెలిపింది. సదరు మహిళతో పాటు మరికొంత మందితో కలిసి ఆయన విజయవర్ధన్ రావును గెస్ట్ హౌస్‌లో నిర్బంధించాడు. అతడిని బెదిరించి రూ.60 లక్షల నగదు, 97 తులాల బంగారం దోచుకున్నాడు. తనకు పోలీసు అధికారి భుజంగరావు, ఏసీపీ కట్టా సాంబయ్య తెలుసంటూ కన్నారావు బెదిరించాడని బాధి తుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు పోలీసు లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మన్నెగూడ భూవివాదంలో ఇప్పటికే కన్నారావుపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.

## నా గెలుపును ఆపలేరు.. కిషన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు



సికింద్రాబాద్: ఎవరెన్ని కుట్రలు చేసినా లోక్‌సభ ఎన్నికల్లో తన గెలుపును ఎవరూ ఆపలేరని కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. సికింద్రాబాద్ ఎంపీగా మరోసారి ప్రజలు తనను గెలిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. గురువారం నాడు ప్రజానివేదికలో భాగంగా కార్యకర్తలతో సమావేశం అయ్యారు. లోక్‌సభ ఎన్నికలపై బీజేపీ పార్టీ కేడర్‌కు దిశానిర్ధేశం చేశారు. అనంతరం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... తాను పని చేశానని అనిపిస్తేనే ఓటు వేయాలని కోరారు. తనకు ఓటు వేసిన ప్రజలు తలదించుకునే పని ఇంతవరకు చేయలేదన్నారు. తాను ఒక్క రోజు కూడా సమయం వృథా చేయకుండా ప్రజల కోసం పనిచేశానని తెలిపారు. తన నియోజకవర్గంలో కాంట్రాక్టర్లు ఎవరో కూడా తనకు తెలియదన్నారు.తాను పనులు ఇచ్చిన కాంట్రాక్టర్ మొహం కూడా ఇప్పటి వరకు చూడలేదని చెప్పారు. తన నియోజకవర్గ అభివృద్ధి, రాష్ట్ర అభివృద్ధి కోసమే పని చేశానని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, గత మంత్రులు కూడా తనను అసభ్యంగా ధూషించారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకు అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ప్రజలు ఓడించారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. తాను పని చేశానని భావిస్తేనే ఓటేయండి.. పనిచేయలేదు అనుకుంటే ఓటు వేయొద్దన్నారు. తన పార్టీ సహకారం, కార్యకర్తలు, ప్రజల కృషితోనే తాను గెలిచానని అన్నారు. మరోసారి సికింద్రబాద్ ఎంపీగా పోటీ చేస్తున్నానని తెలిపారు. మరోసారి తనను ఆశీర్వదించి సికింద్రాబాద్ ఎంపీగా గెలిపించాలని కిషన్‌రెడ్డి కోరారు.

## కేసీఆర్‌ను బద్నాం చేయాలనే కాఫర్ డ్యామ్ కట్టడంలేదు: కేటీఆర్



హైదరాబాద్: కాంగ్రెస్‌కు రాష్ట్రం, రైతుల కంటే రాజకీయాలే ముఖ్యమని స్పష్టమైందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. మేడిగడ్డ బ్యారేజీ పరిణామాలపై ఎక్స్(ట్విటర్) వేదికగా ఆయన స్పందించారు. మేడిగడ్డ వద్ద కాఫర్ డ్యామ్ కట్టి మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. నీళ్లు ఎత్తిపోసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఇంజినీర్లు నివేదిక ఇచ్చాక కట్టేందుకు ఎల్అండ్‌టీ ముందుకొచ్చిందని గుర్తుచేశారు.

ఈ ప్రభుత్వం చిల్లర రాజకీయాలతో రైతుల జీవితాలతో చెలగాటం ఆడుతోందన్నారు. కేసీఆర్‌ను బద్నాం చేయాలనే కాఫర్ డ్యామ్ కట్టడం లేదని విమర్శించారు. ఇంత నీచమైన రాజకీయాలు లోక్‌సభ ఎన్నికల్లో లాభం కోసమేనా అని కేటీఆర్ ప్రశ్నించారు.

## ఓటుకు నోటు కేసులో కీలక పరిణామం.. మరోసారి..

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 18: ఓటుకు నోటు కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసు విచారణ వాయిదా పడింది. ఓటుకు నోటు కేసులో చంద్రబాబుని నిందితుడిగా చేర్చాలని, దర్యాప్తు సీబీఐకి అప్పగించాలని కోరుతూ వైసీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై సుప్రీం ధర్మాసనం గురువారం నాడు విచారణ చేపట్టింది. జస్టిస్ సుందరేష్, జస్టిస్ ఎస్.వి.ఎన్ భట్టి తో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. విచారణను జులై 24వ తేదీకి వాయిదా వేసింది ధర్మాసనం. సుప్రీంకోర్టు వేసవి సెలవుల అనంతరం కేసు విచారణ చేపడతామని జస్టిస్ ఎంఎం సుందరేష్, జస్టిస్ ఎస్విఎన్ భట్టి ల ధర్మాసనం తెలిపింది. ఓటుకు నోటు వ్యవహారంపై సీబీఐ విచారణ చేపట్టాలని మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. అయితే, ఇప్పటికే పలు దఫాలుగా వాయిదా పడిన ఈ కేసు.. ఇప్పుడు మళ్లీ వాయిదా పడింది. ఈ కేసులో చట్టానికి సంబంధించి అనేక అంశాలు ముడిపడి ఉన్నాయని, ఆ వివరాలను అందించేందుకు సమయం కావాలని తెలంగాణ ప్రభుత్వం కోరింది.

రెండు వారాల్లో కేసుతో ముడిపడి ఉన్న చట్టపరమైన అంశాలతో కూడిన వివరాలను అందించేందుకు సమయం కావాలని తెలంగాణ సర్కార్ కోరింది. అయితే, రెండు వారాల తర్వాత సుప్రీంకోర్టుకు వేసవి సెలవులు వస్తున్నాయని, కేసు విచారణ పూర్తిస్థాయిలో జరగటానికి అవకాశం లేనందున సెలవుల అనంతరం తీసుకోవాలని సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్ర సుప్రీం ధర్మాసనాన్ని కోరారు.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660